క్లుప్తంగా

గణనాథుడికి వెండి ఆభరణాల బహూకరణ



వెండి ఆభరణాలను అర్చకుడికి అందజేస్తున్న దంపతులు

షాద్‌నగర్: పట్టణంలోని శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో గణనాథుడికి ఆదివారం పట్టణానికి చెందిన గార్లపాటి రాధిక, నవీన్‌కుమార్ దంపతులు 45 తులాల వెండి చెవి తొడుగులను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ నవీన్‌కుమార్, లష్కర్ ఆంజనేయులు, రేటికల్ నందీశ్వర్, కృష్ణయ్య, వెంకటరమణ, ఎంపీఎస్ సురేశ్, పాలాది వెంకటరమణ, రాజేశ్, ఎంసాని శ్రీనివాస్, జగదీశ్వర్, ఉప్పల శ్రీనివాస్, తాటి విజయ్, మేనేజర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



కొనాయపల్లిలో బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొనేపల్లితండాకు చెందిన శ్రావణ్‌నాయక్ ఆదివారం ఆకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా కేశంపేట గ్రామంలో తిమ్మగళ్ల దేవమ్మ దశదినకర్మ నిమిత్తం ఆమె రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఈ నగదును ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో రాంచెందర్, రాజు, శ్రీధర్, శ్రీకాంత్, ఆంజనేయులు, చెన్నయ్య, సాయికుమార్, అనిల్, గణేశ్, బన్ని, యాదయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవతోనే గుర్తింపు



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: సమాజంలో విద్యతో పాటు ఉద్యోగాలు చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే గుర్తింపు వస్తుందని ఇంటర్నేషనల్ స్వామి నారాయణ గురుకుల్ పాఠశాల స్వామిజీ సుక్‌వల్లభ్ స్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని స్వామి నారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాల, కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2014–15లో పదో తరగతి విద్యార్థులు, 2016–17లో ఇంటర్మీడియట్ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుక్‌వల్లభ్ స్వామిజీ పాల్గొని మాట్లాడుతూ.. నేటి సమాజంలో సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఇంటర్నేషనల్ స్వామి నారాయణ గురుకుల్ పాఠశాలలో పది సంవత్సరాల క్రితం ఎస్ఎస్‌సీ, ఇంటర్ విద్యను అభ్యసించిన పలు రాష్ట్రాల విద్యార్థులు నేడు సమ్మేళనంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కృష్ణచరణ్‌దాస్, వివిధ రాష్ట్రాలకు చెందిన పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పొదుపు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న నర్సింహులు

షాబాద్: ప్రతి ఒక్కరూ పొదుపును అలవర్చుకోవాలని వివేకానంద పరస్పర సహకార పొదుపు సంఘం అధ్యక్షుడు నర్సింహులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంఎస్ గార్డెన్‌లో ఆయన అధ్యక్షతన 19వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం గడిచిన 19 సంవత్సరాల్లో దినదినాభివృద్ధి చెందుతూ, 802 మంది సభ్యులతో రెండున్నర కోట్ల టర్నోవర్ సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో రామాంజనేయ మండల సమాఖ్య ముఖ్య సలహాదారు బాల్‌రాజ్, పాలక మండలి సభ్యులు మల్లికార్జున్, ప్రదీప్, రజినీకాంత్, హరీశ్, చంద్రయ్య, సత్యం, గౌరీశ్వర్, భాగ్యవతి, మల్లేశ్, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



డేంజర్ వీల్స్

- కేజీవీల్ ట్రాక్టర్లతో జాగ్రత్త
- నైపుణ్యం, అవగాహన లోపంతో ప్రమాదాలు
- ప్రాణాలతో చెలగాటం వద్దంటున్న నిపుణులు

షాబాద్: ప్రస్తుత కాలంలో వ్యవసాయంలో యంత్రాల వినియోగం ఎక్కువైంది. పొలం దున్నేందుకు, జంబు కొట్టేందుకు కేజీవీల్ ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారు. కేజీవీల్స్‌తో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. డ్రైవర్లు కేజీవీల్స్ కిందపడి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం. ప్రస్తుతం వానాకాలం సాగు ప్రారంభమైంది. వర్షాలు కూడా కురుస్తున్నాయి. రైతులు పంట పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ తరుణంలో డ్రైవర్లు కేజీవీల్స్ నడిపించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రమాదాలకు కారణాలివే ..

- పొలాలన్నీ ఒకే విధంగా ఉండవు. నీటితో నింపిన తర్వాత డ్రైవర్‌కు భూమి తీరుపై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.
- నారు ఎక్కువగా ఉన్న స్థలంలో ఎక్కువ లోతుకు కేజీవీల్ వెళ్లడం. అక్కడ భూమి వదులుగా మారడం జరుగుతుంది. భూమి గట్టిగా ఉన్న ప్రదేశంలో డ్రైవర్లు యాక్సిలరేటర్‌ను పెంచుతుంటారు. బరువంతా కేజీవీల్స్‌పై పడుతుంది. ముందు టైర్లు అంతగా బరువు లేకపోవడంతో ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా కొడుతుంది.
- పొలం మూలల్లో ఎక్కువ సార్లు కేజీవీల్స్ నడుస్తాయి. అక్కడ లోతుగా తయారవుతుంది. వేగంగా వెళ్లే క్రమంలో దిగబడి బోర్లా పడుతుంది.
- డ్రైవర్లకు పూర్తిస్థాయి నైపుణ్యం లేకపోవడం, ఓవర్ స్పీడ్‌తో పొలాల్లో దున్నడంతో ప్రమాదాలు జరుగుతాయి. పొలంలో లోతు పెరిగినా కొద్ది ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- కేజీవీల్స్ 20–25 సెం.మీ కన్నా ఎక్కువ లోతుకు వెళ్తే ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి.

ముందస్తు జాగ్రత్తలు..

- కేజీవీల్స్ బిగించేటప్పుడు తప్పనిసరిగా వెనుక టైర్లు సమాన స్థాయిలో ట్రాక్టర్ బంపర్ ముందు వెయిట్ బిల్లలు వేసుకోవాలి.
- బరువు ఎక్కువతే మైలేజ్ తక్కువగా వస్తుందనే ఉద్దేశంతో వాడటం లేదు. అది సరైన విధానం కాదు.
- ట్రాక్టర్‌ను పొలంలోకి దించే ముందు పూర్తిస్థాయిలో కండిషన్‌గా ఉంచుకోవాలి.
- పొలం దున్నుతున్న సమయంలో ట్రాక్టర్‌ను ఎప్పుడు ఒకే వేగంతో నడపాలి.
- యజమానుల మెప్పు కోసం వేగం పెంచొద్దు.
- మూల మలుపు దగ్గర వేగం తగ్గించాలి.
- కేజీవీల్స్‌తో దున్నేప్పుడు ట్రాక్టర్‌కు కల్టివేటర్ అమర్చుకోవాలి. దీంతో బోల్తాపడే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

యువత క్రీడల్లో రాణించాలి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో చిన్నోళ్ల జంగమ్మ జ్ఞాపకార్థం బీపీఎల్ పేరుతో 25 రోజుల నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీలో మొత్తం 54 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం బూర్గుల, తిర్మలగిరి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఫైనల్‌లో బూర్గుల జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై విజేత జట్టుకు రూ.80వేల నగదు, ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.40 వేలతో పాటుగా ట్రోఫీని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడు తూ.. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని, పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్ అరుణ, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కొందుర్గు: కాంగ్రెస్ కార్యకర్తలకు కష్టాలు రాకుండా అండగా ఉంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం లచ్చంపేట గ్రామంలో కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. త్వరలోనే రైతులకు రుణమాఫీ, ఇళ్లులేని పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి అధికారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, మహిళా కమిటీ అధ్యక్షురాలు పిట్ట రజిత, నాయకులు ఆంజనేయులు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



షాద్‌నగర్‌రూరల్: సమ్మేళనంలో మొగిలిగిద్ద జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని మొగిలిగిద్ద జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988–89వ సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ చిన్ననాటి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనానికి పూర్వ విద్యార్థి, సినీనటుడు, నిర్మాత బండ్ల గణేశ్ హాజరై అందరినీ ఎంతో అలరించారు. సినీరంగంలో తన అనుభవాలను మిత్రులతో పంచుకున్నారు. చిన్ననాటి మిత్రులను ఈ వేదికపై కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని బండ్ల గణేష్ అన్నారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, శోభారాణి, అనురాధ, మాధవి, శ్రీలత, లక్ష్మీ, యశోద, శ్రీమతి, బదారున్నీసా, తయ్యబున్నీసా, మేఘమాల, అలివేలు, సుజాత, మాధవీలత, జమీల్, మల్లేశ్, రవీందర్‌రెడ్డి, శివలింగం, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, నరేందర్, మల్లేష్, బాలయ్య, ఫణికుమార్, శ్రీను, నర్సింలు, పుల్లయ్య, ఆనంద్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: షాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–1988లో పదో తరగతి చదివిన విద్యార్థులు మండల కేంద్రంలోని ఆన్‌మోల్ గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వీరాస్వామి గౌడ్, లింగం, యాదగిరిచారి తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు కుమ్మరి యాదగిరి, కమ్మరి శ్రీను, పెంటయ్య, మల్లేశ్, కోళ్ల యాదయ్య, బస్వరాజ్‌గౌడ్, రఘుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

మొయినాబాద్: మండల పరిధిలోని కనకమామిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మొయినాబాద్‌లోని ఓ ఫాంహౌస్ లో సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒక్క చోట కలిసి నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబు ద్ధులు నేర్పించిన ఉపాధ్యాయుడు వసంత కిష్టప్ప ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్, మమేందర్, అశోక్‌గౌడ్, పాషా, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, ఉపేందర్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, భా స్కరరావు, విక్రమ్, శేఖర్, సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: సమ్మేళనంలో విద్యార్థులు



మొయినాబాద్: ఉపాధ్యాయులతో విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఏఈ సాయికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడ, స్టేషన్ తిమ్మాపూర్, ఫాతీమాపూర్, ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలకు అడ్డు ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్న కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా నిలిపివేస్తామని ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్ అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని మహల్ ఎలికట్ట గ్రామంలో ఆదివారం భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో మాజీ వార్డుసభ్యుడు బుడ్డ నర్సింహ్మా సహకారంతో యువకులకు క్రికెట్ కిట్, టీషర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడలతో పాటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ముందుకుసాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూసుఫ్, శ్యాంకుమార్, సురేష్, నరేశ్, కిరణ్, రాజేశ్, రాము, శివ, శ్రీకాంత్, జంగయ్య వెంకటేశ్, గిరి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతం జ్ఞానాన్ని అందిస్తుంది

ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యుడు నాగ్యనాయక్



ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

షాద్‌నగర్: త్రైత సిద్ధాంతం మానవాళికి కావాల్సిన జ్ఞానాన్ని అందిస్తుందని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మహబూబ్‌నగర్ కమిటీ సభ్యుడు నాగ్య నాయక్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చింబోడ్ గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై జ్ఞానవేదిక జిల్లా వేదిక సమితీ సభ్యులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ మత మూలగ్రంథం అయినా మనిషి మోక్షంవైపు పోవు మార్గాన్ని భోదిస్తుందన్నారు. ఆ గ్రంథముల సారమంతా త్రైత సిద్ధాంతంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. త్రైత సిద్ధాంతం మతాతీత జ్ఞానాన్ని, సర్వమానవాళికి అవసరమైన ఆధ్యాత్మిక సంపదను అందిస్తుందన్నారు. మానవుడి ఆత్మల గురించి తెలుసుకోవడం ద్వారా మధ్యాత్మ ఆరాధనతో ధర్మస్థాపన జరుగుతుందన్నారు. ఇదే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జ్ఞాన వేదిక సభ్యులు శ్రీనివాసులు, కిషోర్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేష్, తిరుపతయ్య, కృష్ణయ్య, బుచ్చిలింగం, యాదయ్య, శ్రీనివాసులు, సావిత్రమ్మ, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి



విల్లాల ప్రాజెక్టు వద్ద కోర్టు నోటీస్ బోర్డును పెట్టి మాట్లాడుతున్న బాధితుడు అమర్

చేవెళ్ల: కోర్టు కేసులో ఉన్న భూమిలో అక్రమంగా ఐకాన్ వెస్ట్ సంస్థ(అంకుర) నిర్మిస్తున్న విల్లాల ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలని కోర్టు కేసు వేసిన మార్నేళ్ల వనజ కుమారుడు అమర్ వాపోయాడు. ఆదివారం శంకర్‌పల్లిలోని పత్తేపూర్ గ్రామంలో ఉన్న ఈ వివాదాస్పద భూమి వద్ద బాధితుడు అమర్ విలేకరులతో మాట్లాడారు. శంకర్‌పల్లి మండలంలోని పత్తేపూర్ గ్రామంలో ఉన్న సర్వే నెంబర్లు 21, 23, 24లోని పార్టులో ఉన్న 21 ఎకరాల భూమి వివాదాస్పదంలో ఉందని తెలిపాడు. దీనిపై 2020–22లో రంగారెడ్డి జిల్లా కోర్టులో వారసత్వంగా రావాల్సిన భూమిపై మా అమ్మ వనజ, చిన్నమ్మ స్వరూపలు కేసు వేశారని చెప్పారు. ఈనెల 4వ తేదీన కోర్టు నుంచి ఈ భూమిపై స్టేటస్ కో–ఆర్డర్ వచ్చిందని చూపించాడు. ఈ ఆర్డర్ ప్రకారం ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం, అమ్మడం చేయొద్దన్నారు. కానీ ఈ భూమిలో ఐకాన్ వెస్ట్ ప్రాజెక్టు వారు నిర్మించిన ప్లాట్లను అమ్ముతున్నారని ఆరోపించారు. ఈ భూమి కోర్టు కేసులో ఉందని దీనికి సంబంధించిన బోర్డును కూడా ఇక్కడ పెడుతున్నట్లు తెలిపారు. ఈ భూమిలో ఉన్న ప్లాట్లను ప్రజలు ఎవరూ కొని మోసపోవద్దని కోరారు. కోర్టు ఆదేశాల ప్రకారం లీగల్‌గానే వెళ్లి మా వాట భూమిని మేము రాబట్టుకుంటామని చెప్పారు. ఈ విషయంపై ఐకాన్ ప్రాజెక్టు యాజమాన్యాన్ని విలేకరులు వివరణ కోరగా.. వనజ, స్వరూప అనే వ్యక్తులు తమ సంస్థను బదనాం చేస్తున్నారని, కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్‌లు వారికి లేదన్నారు. తమ ప్రాజెక్టుకు వచ్చే కస్టమర్లను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఏదైనా ఉంటే కోర్టు ద్వారానే తేల్చుకుంటామని ఇలా సంస్థ ప్రతిష్టను బదనాం చేయటం సరైందికాదన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు

షాబాద్: మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో బొడ్రాయి ఉత్సవాలు, మైసమ్మ బోనాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతలతో మైసమ్మ బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. గ్రామస్తులు బోనాల ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచే ఆలయం వద్ద భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.



పోతురాజుల విన్యాసాలు



బోనాల ఊరేగింపు

వంతెన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

- పునాదులకే పరిమితమైన వెంకిర్యాల బ్రిడ్జి పనులు
- వర్షాలు కురిస్తే రాకపోకలు బంద్
- త్వరగా పూర్తి చేయాలని స్థానికుల డిమాండ్



పునాదులకే పరిమితమైన వంతెన నిర్మాణం

కొందుర్గు: ఏళ్లు గడుస్తున్నా రోడ్లపై వంతెనల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాలకులు మారుతున్నా తమ సమస్యలు తీరడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. కొందుర్గు మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఐదేళ్ల క్రితం ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో డబుల్ రోడ్డు నిర్మించారు. అదేవిధంగా ఈ రో డ్డుపై దాదాపు అన్ని వంతెనలు నిర్మించారు. కానీ కొందుర్గు మండలంలోని తంగెళ్లపల్లి, వెంకిర్యాల గ్రామాల మధ్యగల వంతెన మాత్రం నిర్మించలేదు. ఈ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 2023 లోనే ఎఫ్‌డీఆర్ నిధుల్లో నుంచి రూ.3.20లక్షలు మంజూరు చేసింది. పనుల ప్రారంభానికి టెండర్ పూర్తయింది. అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ 2023 జూన్ 23న భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వంతెన నిర్మాణం కోసం పునాదులు తీసి దాదాపు ఏడాది కావస్తోంది. ప్రస్తుతం వంతెన నిర్మాణం పునాదులకే పరిమితంగా మారింది.


రాకపోకలు బంద్..

గతంలో పాత వంతెన ఉండటంతో వరదనీరు వంతెనపైనుంచి ప్రవహిస్తేనే రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. కానీ ఉన్న పాత వంతెనను తవ్వడంతో వచ్చే వర్షాకాలం వరదలు ఉధృతంగా ప్రవహిస్తే ఈ రోడ్డుపై రాకపోకలు పూర్తిగా బంద్ అవుతాయని మండల ప్రజలు వాపోతున్నారు. దీంతో కొందుర్గు మండలంలోని వెంకిర్యాల, ఆగిర్యాల, లక్ష్మీదేవిపల్లి, కాస్లాబాద్, ఎదిర, రావిర్యాల తదితర గ్రామాల ప్రజలకు కొందుర్గు మండల కేంద్రానికి రావడానికి రాకపోకలు నిలిచిపోతాయి. అదేవిధంగా కొందుర్గు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు మహబూబ్‌నగర్ వెళ్లడానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. మండలంలోని లాలపేట, టేకులపల్లి, గంగన్నగూడ, విశ్వనాథ్‌పూర్ తదితర గ్రామాలకు సంబంధించిన రోడ్లపై వంతెనలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెనల నిర్మాణం పూర్తి చేయాలని గతంలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్రలు చేశారు. ఈ ప్రభుత్వం హయాంలోనైనా వంతెనలు పూర్తయితే తమ ఇబ్బందులు తీరుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన (ఫైల్)

రాకపోకలు నిలిచిపోతాయి



వంతెన నిర్మించకుంటే వెంకిర్యాల గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షా లు ప్రారంభమైతే ఈ రోడ్డుపై రాకపోకలు పూర్తిగా బంద్ అవుతాయి. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలి.

– లింగంగౌడ్, మాజీ సర్పంచ్, వెంకిర్యాల

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

ప్రస్తుతం వంతెన నిర్మాణానికి సంబంధించి రీడిజైన్ చేశాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. పనుల ప్రారంభానికి కాంట్రాక్టర్ కాస్తా ఆలస్యం చేశాడు. ఈ ఏడాది వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడకుండా చూస్తాం.

– రవీందర్‌కుమార్, ఆర్అండ్‌బీ డీఈ, షాద్‌నగర్